# మధుమేహానికి శాశ్వత పరిష్కారం!



**క్లోమాన్ని పునరుద్ధరించే విధానం ఆవిష్కరణ**

**అనుకోకుండా కనిపెట్టిన ఆస్ట్రేలియా పరిశోధకులు**

**క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే అద్భుతాలే**

మెల్‌బోర్న్, జనవరి 5: మధుమేహ బాధితులకు శుభవార్త.. శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకొనేందుకు ఇన్సులిన్ ఇంజెక్షన్లతో, మాత్రలతో విసిగి వేసారిపోతున్నవారికి ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు కారు చీకట్లో కాంతిరేఖలాంటి వార్త చెప్పారు. క్యాన్సర్‌కు చికిత్స చేస్తుండగా అనుకోకుండా క్లోమాన్ని పునరుద్ధరించే విధానాన్ని ఆవిష్కరించినట్టు ప్రకటించారు. శరీరంలో చక్కెరలను (గ్లూకోజ్) నియంత్రించేందుకు, జీవకణాలు దానిని శోషించుకొనేందుకు ఇన్సులిన్ ప్రధాన వాహకం అన్న విషయం తెలిసిందే. ఈ ఇన్సులిన్‌ను క్లోమగ్రంథి ఉత్పత్తి చేస్తుంది. టైప్-1 డయాబెటిక్ బాధితుల్లో పుట్టుకతోనే క్లోమగ్రంథి దెబ్బతిని ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే శక్తిని కోల్పోతుంది. వాళ్లు జీవితాంతం ఇన్సులిన్ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. టైప్-2 డయాబెటిక్ బాధితులకు వివిధ కారణాల వల్ల క్లోమం ఇన్సులిన్ ఉత్పత్తి చేసే శక్తిని కోల్పోతుంది. వాళ్లు సమస్య తీవ్రతను బట్టి ఇన్సులిన్ ఇంజెక్షన్ లేదా మాత్రలు వాడుతుంటారు. ఇప్పటివరకు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదు. అయితే ఆస్ట్రేలియాకు చెందిన బేకర్ హార్ట్ అండ్ డయాబెటిక్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు క్లోమగ్రంథి స్రావాల ప్రవాహ నాడుల్లో ఏర్పడిన క్యాన్సర్ కణతులను నయం చేసేందుకు ప్రక్కతిసిద్ధమైన విధానాలపై పరిశోధనలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎన్‌హాన్సర్ ఆఫ్ జెస్ట్ హోమోలాగ్-2 ఎంజైమ్ (ఈజెడ్‌హెచ్2)ను ఆ కణతులపై ప్రయోగించారు. ఈ ఎంజైమ్ సహజసిద్ధంగానే ఏర్పడుతుంది. క్యాన్సర్ కణతులపై దాడిచేసిన ఈ ఎంజైమ్ పరిశోధకులు ఊహించని విధంగా డక్టల్ ప్రోజెనిటర్ కణాలను ఉత్తేజితం చేసింది. జీవకణాలకు ఈ డక్టల్ ప్రోజెనిటర్ కణాలను వారసులుగా పేర్కొంటారు. గ్లూకోజ్ వల్ల తీవ్రంగా దెబ్బతిన్న క్లోమంలోని ఇన్సులిన్‌ను ఉత్పత్తిచేసే బీటా సెల్స్‌ను ఈ డక్టల్ కణాలు పునఃసృష్టి చేశాయి. దీంతో ఎప్పటికీ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేదనుకొన్న క్లోమగ్రంథి ఉన్నట్టుండి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయటం మొదలుపెట్టిందని పరిశోధకుల బృందం నాయకుడు సామ్ ఎల్-ఓస్టా తెలిపారు. ఈ పరిశోధన ఇప్పటికీ ప్రాథమిక దశలోనే ఉన్నదని చెప్పారు. క్లినికల్ ట్రయల్స్‌లో ఇది విజయవంతమైతే వైద్యప్రపంచంలో అద్భుతాలు జరుగుతాయని పేర్కొన్నారు.



అయోధ్య భూ వివాద కేసులో కక్షిదారైన ఇక్బాల్ అన్సారీకి ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

## కక్షిదారు అన్సారీకి ఆహ్వానం

హైదరాబాద్, జనవరి5 (నమస్తే తెలంగాణ)/అయోధ్య: రామజన్మభూమి-బాబ్రీ మసీదు కేసు కక్షిదారుల్లో ఒకరైన ఇక్బాల్ అన్సారీకి అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ ఆహ్వానం అందింది. తన తండ్రికి శుక్రవారం ఇంటికి వచ్చి ఆహ్వాన పత్రిక అందించారని అన్సారీ కూతురు శర్మ పర్వీన్ వెల్లడించారు. 2019లో రామ మందిరం కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముస్లిం వర్గం గౌరవిస్తుందని డిసెంబర్ 31న అన్సారీ తెలిపారు.



అయోధ్య రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గరుడ విగ్రహం

**అయోధ్యకు లక్ష తిరుపతి లడ్డూలు**

అయోధ్యలో 22న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా భక్తుల కోసం లక్ష తిరుమల లడ్డూలను పంపనున్నట్టు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఒక్కో లడ్డూ 25 గ్రాములు ఉంటుందని చెప్పారు. సనాతన హైందవ ధర్మ ప్రచారంలో భాగంగా ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు తిరుమలలో ధార్మిక సంస్థలతో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**అయోధ్య ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు**

అయోధ్య విమానాశ్రయానికి 'మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయం, అయోధ్యధామ్' పేరు పెట్టాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎయిర్‌పోర్ట్‌కు అంతర్జాతీయ విమానాశ్రయ హోదా కల్పించింది.

# నౌక హైజాక్ కలకలం

**సోమాలియా తీరంలో కార్గో షిప్‌ను హైజాక్ చేసిన సాయుధ దుండగులు**

నౌకలో 15 మంది భారతీయ సిబ్బంది.. సమాచారంతో రంగంలోకి దిగిన నేవీ

భారతీయులతో సహా మొత్తం 21 మందిని కాపాడిన కమాండోలు

ఐఎన్ఎస్ చెన్నై, ఎయిర్‌క్రాఫ్ట్‌తో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన నేవీ అధికారులు

న్యూఢిల్లీ, జనవరి 5: ఆఫ్రికా దేశమైన సోమాలియాలో అరేబియా సముద్ర తీరంలో గురువారం ఓ కార్గో నౌక హైజాక్‌కు గురైంది. లైబీరియా జెండాతో ఉన్న కార్గో నౌక 'ఎంవీ లిలా నార్ఫోక్'లో 15 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. హైజాక్ సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన భారత నేవీ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. సముద్ర గస్తీ విధుల్లో ఉన్న ఐఎన్ఎస్ చెన్నైతో సహ మరో పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో రంగంలోకి దిగింది. శుక్రవారం సాయంత్రానికి హైజాక్ గురైన నౌక వద్దకు చేరుకొన్న అనంతరం.. భారత నేవీ కమాండోలు భారతీయ సిబ్బందితో సహ అందులో ఉన్న 21 మందిని సురక్షితంగా రక్షించారని భారత నేవీ అధికార ప్రతినిధి వివేక్ మధ్వాల్ పేర్కొన్నారు. ఆ సమయానికి నౌకను హైజాగ్ చేసిన దుండగులు అందులో లేరని, అంతకుముందు చేసిన హెచ్చరికలతో పారిపోయారని కమాండోలు ధ్రువీకరించినట్టు నేవీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. నౌక హైజాక్‌కు సంబంధించి యూకే మారిటైమ్ ఏజెన్సీ(యూకేఎంటీవో) నుంచి భారత నేవీకి గురువారం సాయంత్రం సమాచారం అందింది. నేవీ అధికారులు వెంటనే యుద్ధ నౌక ఐఎన్ఎస్ చెన్నైతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్‌ను కూడా రంగంలోకి దింపారు. ముందుగా ఎయిర్‌క్రాఫ్ట్ సాయంతో నౌకలోని సిబ్బందితో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకొన్నారు. అనంతరం హైజాక్‌కు గురైన నౌక వద్దకు చేరుకొన్న ఐఎన్ఎస్ చెన్నై.. హెలికాప్టర్‌ను ప్రయోగించి షిప్‌ను వదిలి వేయాలని హైజాక్ చేసిన సముద్ర దొంగలకు హెచ్చరిక చేసిందని అధికారులు తెలిపారు.



సోమాలియా తీరంలో హైజాక్‌కు గురైన ఎంవీ లిలా నార్‌ఫోక్ సరకు రవాణా నౌక

**నౌకలోకి ఆరుగురు సాయుధ దుండగులు**

సోమాలియా తూర్పు అరేబియా సముద్ర తీరానికి 300 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రపు దొంగలు ఈ మర్చంట్ నౌకను హైజాక్ చేశారు. ఇది బ్రెజిల్‌లోని పోర్ట్ డు అకో నుంచి బహ్రెయిన్‌లోని ఖలీఫా బిన్ సల్మాన్‌కు వెళ్తున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నౌకలోకి ప్రవేశించిన ఆరుగురు సాయుధ దుండగులు హైజాక్ చేసినట్టు తెలుస్తున్నది. హైజాక్‌కు గురైన వెంటనే నౌక సంబంధిత సమాచారాన్ని యూకేఎంటీవో పోర్టల్‌కు పంపింది. తర్వాత వెంటనే యూకే మారిటైమ్ ఏజెన్సీ అప్రమత్తం చేయడంతో భారత నేవీ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. పెట్రోలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పీ81, ప్రిడేటర్ డ్రోన్ల సాయంతో నౌకపై నిరంతర నిఘా పెట్టింది. గత నెల గుజరాత్ సముద్ర తీరంలో ఒక కార్గో నౌకపై డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే.



ఐఎన్ఎస్ చెన్నై

**అమెరికా హెచ్చరికలను లెక్కచేయని హౌతీలు**

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం నేపథ్యంలో హమాస్‌కు మద్దతు పలుకుతున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్రసముద్రంలో నౌకలను లక్ష్యంగా చేసుకొని వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. హౌతీలు నౌకలపై దాడులను ఆపాలని, లేకుండా తీవ్ర సైనిక చర్య ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా, పలు ఇతర మిత్రదేశాలు హెచ్చరించాయి. అయితే హెచ్చరించిన కొద్ది గంటలకే హౌతీలు.. యెమెన్ భూభాగం నుంచి ఎర్ర సముద్రంలోని నౌకలపైకి గురువారం మరోసారి డ్రోన్లను ప్రయోగించారు. ఈ డ్రోన్ ఎర్ర సముద్రంలోని అమెరికా నేవీ, వాణిజ్య నౌకలకు కొద్ది మైళ్ల దూరంలో పేలిందని పెంటగాన్ వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనలో ఎవరూ మరణించలేదని, నష్టం జరుగలేదని పేర్కొన్నాయి.

## కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై దాడి

శాన్‌ఫ్రాన్సిస్కో, జనవరి 5: అమెరికాలో హిందూ ఆలయాలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట నేవార్క్‌లోని స్వామినారాయణ్ మందిర్‌పై దాడి ఘటనను మరువక ముందే మళ్లీ అలాంటి ఘటన చోటుచేసుకున్నది. తాజాగా కాలిఫోర్నియాలోని షెరావాలి ఆలయంపై దాడి జరిగింది. ఆలయ గోడలపై కొందరు ఖలిస్థాన్ అనుకూల రాతలు రాశారు. విషయం తెలిసిన హిందూ అమెరికన్ ఫౌండేషన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## కరోనాతో ఒక్కరోజే 12 మంది మృతి


**తాజాగా 761 మందికి పాజిటివ్**

న్యూఢిల్లీ, జనవరి 5: దేశంలో కరోనా చాపకింద నీరులా విస్తరిస్తున్నది. కరోనాతో ఒక్కరోజే 12 మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో ఐదుగురు, కర్ణాటకలో నలుగురు, మహారాష్ట్రలో ఇద్దరు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు మృతిచెందారు. గురువారం నుంచి శుక్రవారం నాటికి 24 గంటల్లో దేశవ్యాప్తంగా 761 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 4,334కు చేరింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 619 నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా కర్ణాటకలో 199, కేరళలో 148, మహారాష్ట్రలో 47 వెలుగుచూశాయి.

## 85 మందికి కోటికి పైగా వేతనం

**ప్రాంగణ నియామకాల్లో సత్తా చాటిన బాంబే ఐఐటీ**

ముంబై, జనవరి 5: ఐఐటీ బాంబే విద్యార్థులు క్యాంపస్ నియామకాల్లో సత్తా చాటారు. ఏకంగా 85 మంది కోటి రూపాయలకు పైగా ప్యాకేజీతో ఉద్యోగాలు పొంది వావ్ అనిపించారు. ఈ మేరకు ఐఐటీ బాంబే గురువారం రాత్రి మొదటి విడత నియామకాల వివరాలను వెల్లడించింది. ఈ సారి 63 మంది విద్యార్థులు అంతర్జాతీయ ఆఫర్‌లను పొందారు. నియామకాలు జరిపిన వాటిలో జపాన్, తైవాన్, సౌత్ కొరియా, నెదర్లాండ్స్, సింగపూర్, హాంకాంగ్ దేశాల కంపెనీలు ఉన్నాయి. అయితే మొత్తం మీద చూస్తే మొదటి విడతలో గత ఏడాదికన్నా తక్కువ ఆఫర్లే వచ్చాయి.



## ఈవీఎంలను వాడితే మళ్లీ బీజేపీదే అధికారం

**మాజీ గవర్నర్ సత్యపాల్**

న్యూఢిల్లీ, జనవరి 5: ప్రస్తుతం ఈవీఎంలను ఏ విధానంలోనైతే వినియోగిస్తున్నామో అదే విధానంలో లోక్‌సభ ఎన్నికల్లో ఉపయోగిస్తే కచ్చితంగా మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ చెప్పారు. ఈవీఎంల పనితీరుపై ఇప్పటికే పలువురు ప్రతిపక్ష నేతలు అనుమానాలను బహిర్గతపర్చారని, అయినా ఎన్నికల కమిషన్ సరిగ్గా స్పందించడం లేదని తెలిపారు. బహుశా ఎన్నికల కమిషన్‌పై ఏదైనా ఒత్తిడి ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఓటు వేసిన తర్వాత వచ్చే వీవీప్యాట్‌లను లెక్కించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టిసారించాలని కోరారు.

**ఈవీఎంలు విశ్వసనీయమైనవే**

ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఎన్నికల సంఘం ప్రకటించింది. వీటిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలను తిరస్కరించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్)ల పనితీరుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. ఎన్నికల్లో వీటి పనితీరుపై పూర్తి నమ్మకం ఉందని ప్రకటించింది. వీవీ ప్యాట్‌లు, ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు కలుసుకోవాలనుకుంటున్నారని, వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ జైరాం రమేశ్ రాసిన లేఖపై ఈసీఐ స్పందించింది.

# బెంగాల్‌లో ఈడీ అధికారులపై దాడి

- దాడికి పాల్పడిన తృణమూల్ కాంగ్రెస్ నేత మద్దతుదారులు!
- ముగ్గురు ఈడీ అధికారులకు గాయాలు.. వాహనాలు ధ్వంసం
- రాజకీయ దుమారం రేపిన ఘటన
- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని విపక్షాల డిమాండ్
- దాడిని ఖండించిన గవర్నర్ సీవీ ఆనంద్ బోస్



దాడిలో గాయపడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారి

కోల్‌కతా, జనవరి 5: పశ్చిమబెంగాల్‌లో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై దాడి జరిగింది. ఓ కేసు దర్యాప్తులో భాగంగా ఉత్తర 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖాలిలోని టీఎంసీ నేత షేక్ షాజహాన్ ఇంట్లో సోదాలకు వచ్చిన అధికారులు, వారికి భద్రతగా వచ్చిన సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై వందలాది మంది గుంపు దాడికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లు, ఇటుకలతో దాడి చేశారని, ముగ్గురు అధికారులకు తీవ్ర గాయాలయ్యాయని ఈడీ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దాడి ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపింది. దాడికి పాల్పడిన వారంతా షాజహాన్ అనుచరులు, మద్దతుదారులుగా అనుమానిస్తున్నట్టు ఈడీ తన ఫిర్యాదులో పేర్కొన్నది. షాజహాన్ ఇంటికి సోదాలకు వెళ్లిన సమయంలో దాదాపు 800-1000 మంది మూక దాడికి వచ్చారని, అధికారులు, భద్రతా సిబ్బందిని ఘెరావ్ చేశారని ఈడీ పేర్కొన్నది. ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, పర్సులు వంటివి కూడా దోచుకెళ్లారని, దాడిలో పలు వాహనాలు కూడా ధ్వంసం అయ్యాయని అధికారులు తెలిపారు. గాయాలైన అధికారులు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. రేషన్ పంపిణీ స్కామ్ కేసులో అరెస్టైన మంత్రి జ్యోతిప్రియో మల్లిక్‌కు షాజహాన్ సన్నిహితుడనే పేరున్నది. కాగా, ఈడీ అధికారులపై దాడి ఘటనపై రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. టీఎంసీ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి విమర్శించారు.

**అధికారులే రెచ్చగొట్టారు: టీఎంసీ**

దాడి ఘటనపై వస్తున్న విమర్శలను అధికార టీఎంసీ ఖండించింది. ఈడీ అధికారులు స్థానికులను రెచ్చగొట్టడంతోనే దాడికి దారితీసిందని మంత్రి శశి పంజా ఆరోపించారు. కాగా, దాడి ఘటనకు సంబంధించి 10 మందిని అదుపులోకి తీసుకొన్నట్టు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

**తగిన చర్యలు తీసుకొంటా: గవర్నర్**

దాడి ఘటనను రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ ఖండించారు. తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. బెంగాల్ సొంత రాజ్యం కాదని పేర్కొన్న ఆయన.. మూర్ఖుల రాజ్యంలోనే ఆటవిక పాలన సాగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో అనాగరికత, విధ్వంసాన్ని నియంత్రించాల్సిన బాధ్యత పౌర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ఈడీ అధికారులు సోదాలకు వెళ్లిన సందేశ్‌ఖాలిలో శాంతి భద్రతలను పర్యవేక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ కండ్లు తెరిచి వాస్తవాన్ని చూసి, తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



## 2 నిమిషాల కాల్‌తో 200 మందికి ఉద్వాసన

**అమెరికా టెక్ కంపెనీ నిర్వాకం**

న్యూయార్క్, జనవరి 5: అమెరికాకు చెందిన స్టార్టప్ కంపెనీ ఫ్రంట్ కొత్త ఏడాదిలో ఉద్యోగుల తొలగింపును ప్రారంభించింది. కేవలం రెండు నిమిషాల వర్చువల్ కాల్‌లో కంపెనీకి చెందిన 200 మందిని తొలగించింది. ఉద్వాసనకు గురైన వారిలో పూర్తికాల, పార్ట్ టైం, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నట్టు టెక్ క్రంచ్ వెల్లడించింది. ఈ సమావేశంలో సీఈవో జెస్సీ డీపింటో తన రెండు నిమిషాల ప్రసంగంలో సంస్థ ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దివాలాకు బదులుగా చేపడుతున్న ప్రత్యామ్నాయాలు వివరిస్తూ, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించారు. యూఎస్ కేంద్రంగా 2017లో ప్రారంభమైన ఫ్రంట్ టెక్ అమెరికాలోని అతి ఖరీదైన వెయ్యి అపార్ట్‌మెంట్‌ల నిర్వహణ బాధ్యతను చూస్తుంది. అయితే అద్దె వసూలు విషయంలో ఏర్పడిన ఇబ్బందులతో సంస్థ ఆర్థికంగా చిక్కుల్లో పడింది.

## మొహల్లా క్లినిక్‌లపై సీబీఐ దర్యాప్తు

- ఆదేశించిన కేంద్రప్రభుత్వం
- నకిలీ పరీక్షలు, నాసిరకం మందులు సరఫరా చేసినట్టు ఆరోపణలు



న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ దవాఖానలతో పాటు ఆప్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మొహల్లా క్లినిక్‌లపై కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ) దర్యాప్తునకు ఆదేశించింది. నాసిరకం మందుల సరఫరా, నకిలీ పరీక్షలు నిర్వహించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈ మేరకు చర్యలు చేపట్టింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా చేసిన సిఫారసుల మేరకు ఈ ఆదేశాలు జారీచేసింది. ఈ మందులు నాణ్యతా ప్రమాణాల పరీక్షల్లో విఫలమైనట్లు సక్సేనా తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వం నడుపుతున్న దవాఖానల్లో రోగులకు వీటిని అందజేయడం వల్ల వారి ప్రాణాలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఈ మందులపై దర్యాప్తు జరిపించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ కూడా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది.

**తప్పుడు ఆరోపణలు.. బూటకపు దర్యాప్తు**

దేశ రాజధాని నగరంలోని ప్రపంచ స్థాయి ఆరోగ్య వ్యవస్థను ధ్వంసం చేయాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత ఆతిశీ శుక్రవారం ఆరోపించారు. మొహల్లా క్లినిక్‌లు అవినీతిరహితమని, వీటిని కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి రోగికీ మందులను ఉచితంగా ఇస్తున్నామన్నారు. తప్పుడు ఆరోపణలతో, బూటకపు దర్యాప్తులకు ఆదేశిస్తున్నారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. తమను పని చేయకుండా నిలువరించేందుకే బీజేపీ ఈ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు.

## రాజ్యసభ బరిలో స్వాతి మలివాల్


- అభ్యర్థిగా ప్రకటించిన ఆమ్‌ఆద్మీ పార్టీ
- సంజయ్ సింగ్, ఎన్డీ గుప్తాలకు రెండోసారి అవకాశం

న్యూఢిల్లీ: ఈ నెల 19న ఢిల్లీలో జరగబోయే మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌ను పెద్దల సభకు నామినేట్ చేసింది. ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్న సంజయ్‌సింగ్, ఎన్డీ గుప్తాలకు మరోసారి అవకాశం కల్పించింది. ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న ఎంపీ సుశీల్ కుమార్ గుప్తా హర్యానా ఎన్నికలపై ఆసక్తి చూపడంతో ఆయన స్థానంలో స్వాతి మలివాల్‌ను ఎంపిక చేశారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన స్వాతి మలివాల్ మహిళలపై హింస, వివక్షపై అనేక ప్రచారాలు, ఉద్యమాలు చేశారు. కాగా, ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న సంజయ్‌సింగ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ వేసేందుకు కోర్టు అనుమతించింది.

## డీకే అక్రమాస్తుల కేసు..

# హైకోర్టుకు సీబీఐ

**దర్యాప్తును కాంగ్రెస్ సర్కారు ఉపసంహరించడంపై సవాల్**



న్యూఢిల్లీ, జనవరి 5: అక్రమాస్తుల కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌పై సీబీఐ దర్యాప్తునకు గత ప్రభుత్వం ఇచ్చిన సమ్మతిని ఉపసంహరిస్తూ సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని సీబీఐ సవాల్ చేసింది. ఈ మేరకు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ వేసింది. పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ ఎస్ దీక్షిత్.. వాటిని డివిజన్ బెంచ్‌కు పంపాలని సీజేకు సిఫారసు చేశారు. రాష్ట్రంలో ఈ తరహా కేసు మొదటిదని, ఇందులోని చట్టపరమైన సమస్యలను పరిశీలించేందుకు విస్తృత ధర్మాసనం అవసరమని అభిప్రాయపడ్డారు. అవినీతి నిరోధక, ఆదాయ పన్ను, మనీలాండరింగ్ నిరోధక చట్టాల్లోని నిబంధనలను న్యాయస్థానం విశ్లేషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అటు పిటిషన్‌దారులు, ఇటు ప్రభుత్వ తరపున న్యాయవాదుల వాదనలు విన్నానని, అయితే ఇలాంటి అపారమైన చట్టపరమైన సమస్యలు ఉండే అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయపడుతున్నట్టు పేర్కొన్నారు.

## పవార్ మనవడి కంపెనీపై ఈడీ దాడులు

ముంబై: మహారాష్ట్ర రాష్ట్ర సహకార బ్యాంకు కుంభకోణం కేసులో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ మనవడు, ఎమ్మెల్యే రోహిత్ పవార్ యాజమాన్యంలోని బారామతి ఆగ్రో కంపెనీతోపాటు, దీనికి అనుబంధంగా ఉన్న సంస్థల్లో శుక్రవారం సోదాలు చేసింది. బారామతి, పుణే, పింప్రి, ఔరంగాబాద్‌లలో ఆరు చోట్ల సోదాలు జరిగినట్లు ఈడీ అధికారులు తెలిపారు. నష్టాల్లో ఉన్న సహకార చక్కెర ఫ్యాక్టరీని కొనేందుకు నిధులను మళ్లించారని రోహిత్ పవార్‌పై ఆరోపణలు వచ్చాయి. చక్కెర మిల్లులను కారుచౌకగా అమ్మేస్తున్నారనే ఆరోపణలపై దర్యాప్తు చేయాలని 2019 ఆగస్టు 22న బాంబే హైకోర్టు ఆదేశించింది. ముంబై పోలీస్ శాఖలోని ఆర్థిక నేరాల విభాగం 2019 ఆగస్టులో కేసును నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసును నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నది.

# నోట్ల కట్టలు.. తూటాల మూటలు

- హర్యానా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటిలో భారీగా అక్రమ సొత్తు స్వాధీనం
- అక్రమ మైనింగ్‌పై ఈడీ దాడులు



దాడిలో ఈడీ స్వాధీనం చేసుకున్న నగదు కట్టలు, బంగారు బిస్కెట్లు

చండీగఢ్, జనవరి 5: హర్యానాలో ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే, మరో మాజీ ఎమ్మెల్యే ఇండ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం జరిపిన దాడుల్లో భారీ ఎత్తున అక్రమ సొత్తు లభించింది. వందకుపైగా విదేశీ మద్యం సీసాలు, రూ.5 కోట్ల నగదు, కొన్ని విదేశీ తయారీ తుపాకులు, 300 తూటాలు స్వాధీనం చేసుకున్నామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన ఓ కేసులో ఏడీ అధికారులు కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్, లోక్‌దళ్ మాజీ ఎమ్మెల్యే దిల్‌బాగ్ సింగ్ ఇండ్లలో సోదాలు జరిపారు. మైనింగ్ వ్యాపారం చేస్తున్న సురేందర్ పన్వర్, అతని సహచరుల ఇండ్లలో ఈడీ అధికారులు గురువారం నాడే సోదాలు ప్రారంభించారు. వారి ఇండ్లు, కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో ఈ సోదాలు కొనసాగాయి. దిల్‌బాగ్ సింగ్ యమునానగర్ నియోజకవర్గానికి గతంలో ప్రాతినిధ్యం వహించగా, సురేందర్ పన్వర్ ప్రస్తుతం సోనీపట్ నియోజకవర్గానికి శాసనసభ్యునిగా ఉన్నారు. వీరిద్దరికి చెందిన దాదాపు 20 ప్రదేశాల్లో సోదాలు జరిగాయి. ఈ సోదాలలో మద్యం, నగదుతో పాటు నాలుగు నుంచి ఐదు కిలోల బరువున్న మూడు బంగారం బిస్కెట్లు కూడా లభించాయి. యమునానగర్ దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో మైనింగ్‌పై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నిషేధం విధించినప్పటికీ వీరు తవ్వకాలు కొనసాగించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీరిపై కేసులు నమోదు కాగా ఈడీ హవాలా చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించింది.